# పంతం

గోదావరి వరదలు పొగలాగ చుట్టలు చుట్టకుంటూ ప్రవహించే ఆ చిక్కటి నీటిని చూస్తుంటే భయం వేస్తుంది ఎలాంటి వాళ్ళకైనా. చాకలి వాళ్లు మాత్రం నీటి ప్రవాహంలోకి నిర్భయంగా ఈదుకువెళ్లి నదిలో కొట్టుకువచ్చే చెట్లనీ, కొమ్మల్నీ గట్టుకు తెస్తుంటారు. ప్రతిరోజూ ప్రొద్దున్నే చాకలివాళ్ళంతా చిన్న తెప్పల్ని పొట్టకిందవేసుకుని గోదావరిలోకి దిగుతారు. సాయంకాలమయేసరికి గట్టునిండా పుల్లలు గుట్టలుపడి ఉంటాయి.

మగవాళ్లంతా నడేట్లోకి పోతే ఆడవాళ్ళు పొడుగుపాటి గడలకి కొంకెలు కట్టి గట్టున నిలబడి అందీ అందినంతమేరా పుల్లలు దాటిపోనియ్యకుండా గట్టుకి లాక్కుంటూ ఉంటారు. ఆరోజుల్లో గోదావరి మహా కోలాహలంగా ఉంటుంది. గోదావరి తన మహాప్రవాహంలో అరణ్యాలకి అరణ్యాలని వేళ్ళతో పెల్లగించుకుని వస్తుంటే, ఆ గోదావరి నరికట్టి, పుల్లల నన్నిటినీ గట్టుకు చేర్చి ప్రకృతికంటే తమ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటారు మానవులు.

పుల్లలు పట్టడానికి చాలా నేర్పు కావాలి. కేవలం బలంవల్ల ప్రయోజనం లేదు. నడి ప్రవాహంలో ఒక చెట్టు మనవశం అయితే, ప్రవాహానికి మనం కొంత లొంగితేగాని మనకి ఆ చెట్టు సాధీనంలోకి రాదు. ఆ పుల్లలు పట్టడంలో ఒకవిధమై పోటీ ఉంది, అది చాకలివాళ్ళ నేర్పుకి కొలబద్ద. ఒక్క పుల్లలమీద యావే కాదు వాళ్లని ప్రోత్సహించేది. ఆ పోటీలో వాళ్ళ గౌరవలాఘవాలు ఇమిడి ఉన్నాయి. అందులో నెగ్గినవాడు వాళ్ళలో వీరుడన్న మాట. వాళ్లు ప్రాణాలనయినా లక్ష్యపెట్టకుండా సుడిగుండాల్లోకయినా పోతుంటారు.

రామికి చాలా పెంకిదని పేరు. ప్రతీ విషయమయి ప్రతివాళ్ళతోనూ పోట్లాడడం దాని స్వభావం. ఆమె కనుచీకటి ఉండగానే ఒక కొంకికర్ర పుచ్చుకుని తన ఇంటికి దగ్గరగా ఉన్న రేవులోకి వెళ్లి నిలబడుతుంది. ఇంక ఆనాడు ఆ రేవులోకి ఎవరూ రావడానికి వీల్లేదు. ఎవరయినా సాహసిస్తే పోట్లాట ప్రారంభమవుతుంది. ఆమె నోరు మహావాడి, రెండుమూడు సార్లు పోలీసులు ఆమెను భయపెట్టి చూశారు. తక్కినవాళ్ళమీదకి మల్లేనే ఆమె వాళ్ల మీదకీ చర్రున లేచింది. అధికారులు తమకిచ్చిన అధికారాన్ని ఆమెమీద మాత్రం వాళ్ళు చెలాయించలేకపోయారు. గోదావరీ, పుల్లలూ, తన ఒక్కత్తివే కావని ఆమెకు అర్థమైనప్పటికీ, తను అందరికంటే మొట్టమొదట వచ్చి ఉండగా, ఇంకొకళ్ళు తనకంటే తరవాత వచ్చి పుల్లలు పట్టడంలో ఏమి సబబు ఉందో ఏ న్యాయవాదీ ఆమెకు నచ్చచెప్పలేదు. న్యాయం ఏ పక్కని ఉన్నా న్యాయంకంటే బలమయిన ఆమె నోటికి జడిసి ఇంకే ఆడదీ ఆ రేవులోకి రాదు.

వెంకడు మంచి హుషారుమనిషి. అతడు కోరి తగాదా తెచ్చుకోగలడు. చాకలివాడలో వయసు వచ్చిన ఆడపిల్లలందరికీ వెంకడంటే చాలా ఇష్టం. వాళ్ల దృష్టిలో

అతడొక వీరుడు. వెంకడి తండ్రికీ, రామి తండ్రికీ చాలా కాలంనించీ ఏవో తగాదాలున్నాయి. వెంకడి తండ్రి ఓసారి రామి గుడిసెకి నిప్పంటించాడు కూడానా. అతడు కనిపిస్తే చాలు రామి అతన్ని తిడుతూంటుంది. వెంకడు ఆడదానితో ఎందుకని అంతగా ఎప్పుడూ కలగజేసుకోలేదు. తోడి ఆడపిల్లలందరికీ రామి అంటే అసహ్యం. ఆమెను వాళ్లలో వాళ్ళు 'మొగముండ' అనుకునేవారు.

రామి రోజూ రేవులోకి వచ్చిన ఆడవాళ్ల నందరినీ తమిరిమేస్తూందని వెంకడికి తెలిసింది. ఆ సంగతేమిటో కనుక్కుందామని అతడొక రోజున రేవులోకి వచ్చాడు. రామి పుల్లలు పడుతోంది. ఇద్దరుముగ్గురు ఆడవాళ్ళు గట్టుని నిలబడి ఈర్ష్యగా చూస్తున్నారు. వెంకడు ఒక కొంకి కర్ర చేతులలోకి తీసుకున్నాడు.

రామి చర్రున లేచింది, "ఏరా, యెదవకానా? ఆడదానితో పోటీకొచ్చావా?"

వెంకడు : "నువ్వాడదానవంటే? నేనెరగను... మాటలు తిన్నగా రానియ్యి. నువ్వూ నీ కొంకీ నడేట్లోకెడతారు."

రామి : "నేను ముందొచ్చిన రేవులోకి నువ్వెందుకొచ్చా? సిగ్గునేదేం?"

వెంకడు : "రేవు నీ బాబుదా?"

రామి : "నేను ముందొచ్చా."

వెంకడు : "నేను తరవాతొచ్చా."

రామి : పెంకెదవలు... ఆడదాంతో సమంగా..."

వెంకడు : నువ్వు నాయంగా, నింపాదిగా మాటాడితే నే పోతాను"

రామి హ "నింపాదేంట్రా, నింపాది? నా పుల్లలన్నీ పట్టుకుంటా?"

వెంకడు : "పోనీ! నీ కందని పుల్లలు నే నొల్లుకుంటాలే."

రామి : "నా కందని పుల్లలు నడేట్లోనే."

ఇంక రేవు వదలిపోతే వెంకడు వెనుదీసినట్టవుతుంది. తన తెప్పని గట్టుమీద పడేసి కొంకికర్రతో పుల్లలు లాగడం ప్రారంభించాడు.

రామి ఎల్లా లొంగుతుందో వెంకడికి తెలియడంలేదు. ఆమె ఈడు పిల్లలంతా వెంకడు కన్నుగిటితే కరిగిపోతారు. ఈమె ఒక్కత్తే అతన్ని తల దన్నినట్టు కబుర్లు చెపుతుంది. వాళ్ళలో వాళ్ళకి తగువులున్నా, ఆమెను ఎదిరించి అతనెప్పుడూ తిట్టలేదు. ఆపయిని తనతోనే కాదు. అందరితోనూ అంతే. దీన్ని ఎల్లాగయినా సాధించాలి.

గట్టున నిలబడి పుల్లలు పట్టడంలో రామి వెంకడిని జయించింది. వెంకడు ఆమెచేతి వొడుపూ, ఆ పుల్లలు లాగడంలో ఉండే నాజూకు చూశాడు. అతని కొంకికి తగులుకున్న పుల్లల్లో సగం ప్రవాహంలో జారిపోయాయి. ఆమె కొంకికి తగిలిన పుల్ల గట్టుకి వచ్చిందన్నమాటే. అతడు ఎంత ప్రయత్నించినా చాలా పుల్లలు కొంకి కిందనించి దొర్లిపోతూ ఉండేవి. గట్టుని నిలబడి ఇన్ని పుల్లలు పట్టవచ్చునని అతనికెప్పుడూ తోచలేదు. అతడు ఆమె నేర్పరితనాన్ని ఆశ్చర్యంగా చూస్తూ అల్లా కూర్చుండిపోయాడు.

ఆనాడు గోదావరి చాలా భీకరంగా ఉంది. నాలుగు పక్కలా ఆకాశం నిండా నల్లని మబ్బులు కమ్మాయి. సన్నని చినుకు పడుతోంది. గాలి ఎక్కువగా ఉంది. చాలామంది చాకలివాళ్ళు భయపడి ఆనాడు గోదావరిలోకి దిగలేదు.

ఆవేళ మాత్రం వెంకడు తన తెప్పని పొట్టకింద వేసుకుని దిగాడు. ఆరోజుని ఒక ఆడదానితో పోటీవేసుకుని గట్టుని కూచోడం అతనికి నచ్చలేదు. ఎవరూ సాహసించి దిగలేక పోతున్నారు. అందుకని అతడు సాహసించాడు. అతని వెనక కొంతమంది దిగారు. అతడు తన పుల్లలన్నీ రామి ఉన్న రేవులోకి చేరుస్తున్నాడు. రామి గట్టుని నిలబడి దీక్షగా పడుతోంది. మధ్యాహ్నం తిరిగేసరికి తక్కిన చాకలివాళ్లు పుల్లలు పట్టడం మానివేసి ఇళ్లకి పోయారు. రామీ, వెంకాడూ మిగిలారు. వెంకడు బాగా అలిసి పోయినప్పటికీ రామికంటే ముందుగా ఇంటికి పోకూడదనుకున్నాడు.

కనుచీకటి పడుతోంది. చినుకులూ, గాలీ ఎక్కువవుతున్నట్టు అనిపించాయి.

"నువ్వింకా ఎంచేపుంటా?"

"నువ్వింకా ఎంచేపుంటా?"

వెంకడు మళ్ళీ నీళ్ళలోకి దిగబోతున్నాడు. రామి నీటి అంచుని రాళ్లమీద వాడుపుగా నిలబడి పుల్లల్ని లాగుతోంది.

"జాగ్రత్త! జారి నీట్లో పడిపోతావు!"

"నీ సంగతి నువ్వు సూసుకో, నే పడిపోతే నువ్వేం తియ్యక్కల్లేదు."

"పెద్దకబుర్లు చెపుతున్నావుగాని, నువ్వు పడిపోతే నేనే తియ్యాలి"

దూరాన్ని ఒక పెద్ద చెట్టు కొట్టుకువస్తోంది. వెంకడు ఈదుకుంటో వెళ్ళిపోయాడు.

చెట్టుచాలా బరువుగా ఉంది. ఆపైని బాగా అలసిపోయాడు. రామితో పంతంకోసం దిగాడు. లేకపోతే అతను అలసిపోయిన మీదట దిగడు. చెట్టుని లొంగదీశాడు. మెల్లగా బారలు వేసుకుంటూ గట్టుకి వస్తున్నాడు. కన్నెత్తి గట్టువేపు చూశాడు. కనుచీకట్లో గట్టు కనిపించలేదు.

నెమ్మదిగా బారవేస్తున్నాడు. గట్టు కొంచెం కనిపిస్తోంది.

రామి మొలలోతు నీళ్లలో దిగి అందీఅందని ఒకపెద్ద కొయ్యను కొంకితో పట్టడానికి ప్రయత్నిస్తోంది.

"ఒడ్డొకరకంగా ఉంది. దాన్నొగ్గెయ్యి" అని కేకవేశాడు.

"నీ సెట్టు నువ్వు సూసుకో" అంది రామి. అదేమయిపోతే తనకేం పెంకిముండ. దానికి తెలియదా? అట్టే దిగితే చస్తుంది. కాని గట్టుకేసి చూడ్డం మాత్రం అతడు మానలేదు. ఒకసారి రామి తూలి మళ్ళీ నిలదొక్కుకుంది. వెంకడి నోటిచివరదాకా కేక వచ్చి ఆగిపోయింది. అటు చూడకూడదనుకుని తలవంచి ఈదుకుంటూ వస్తున్నాడు.

ఇంతలో ఏదో జారినట్టు చప్పుడయింది. అతని గుండెలు ఆగిపోయాయి. చేతులు చెట్టుని వదిలేశాయి. తలెత్తి చూశాడు రామిలేదు.

గలగల శక్తి కొలదీ గట్టుకి ఈదుకుంటూ వచ్చాడు. పదిగజాల క్రింద ప్రవాహంలో గలగల కొట్టుకొంటున్న తలకాయ కనిపించింది. ఒక చేత్తో రామిని పైకి ఎత్తాడు. రామి రెండుచేతులతోనూ అతని మెడ మెలివేసింది. ఇద్దరూ మునిగిపోయారు. పెద్ద ప్రయాసతో మెడపట్టు విడిపించుకుని పైకి తేలి ఊపిరి పీల్చుకున్నాడు. రామికి స్పృహతప్పింది.

నెమ్మదిగా ఆమె మెడ తన వీపుమీద ఆన్చి, ఒకచేత్తో నీటిమీద నిలదొక్కుకున్నాడు. గట్టు దగ్గరనించి ప్రవాహం ఈలోగా ఇద్దరినీ లోపలికి నెట్టింది. గట్టు చేరలేనేమో అని అతనికి భయం వేసింది. పుల్లలు పట్టిపట్టి చేతులు పట్టుతప్పుతున్నాయి. ఊపిరి నిలబడ్డం లేదు. కళ్ళు మూసుకుని గట్టువేపు రెండు శరీరాల్నీ ఈడుస్తున్నాడు. ఒక యుగం గడిచినట్టయింది. ఇంతలో గట్టు చేతికి తగిలింది. అక్కడ ప్రవాహం గట్టుని నిలువుగా కోసివేసింది. అతి ప్రయత్నంతో చెయ్యి ఎత్తి గట్టుమీద వేశాడు. అండ ఊడి పడిపోయింది. ఇద్దరూ మళ్ళీ మునిగిపోయారు. అతనికి స్పృహ తప్పుతున్నట్టు అనిపించింది. నెమ్మదిగా ఎలాగో రెండు శరీరాల్ని గట్టుకి చేర్చాడు. ఒక్కక్షణం వెల్లగిల గట్టుమీద పడుకుని ఆయాసం తీర్చుకున్నాడు.

రామి శరీరం కదిలింది. కొంచెం మూలుగు వినబడింది. అతడు లేచి ఆమెను ఇటూ అటూ తిప్పాడు. వచ్చీరాని స్పృహలో ఆమె అతనిచేతిని రెండు చేతులతోనూ పట్టుకుంది. ఆ స్పర్శలో ఆమె యెంతో చెప్పదలుచుకున్నట్టూ అదంతా తనకి తెలిసిపోయినట్టూ అతనికి అనిపించింది.

రామిని భుజాన వేసుకుని వెంకడు చాకలివాడవేపు బయలుదేరాడు.

ఎంత చిత్రమయిన పని జరిగింది! తను తీసినట్టుగా ఆమెకు తెలిసిందన్నమాటే. "నువ్వు జారిపడిపోతే నే నేతియ్యా" లన్నాడు! తమాషాగా! చివరికి అల్లాగే జరిగింది.

ఆమెతో పంతం వేసుకున్నాడు. ఎందుకొచ్చింది అసలు ఆ పంతం? ఆమెను ఇంతకాలం ఎందుకు అసహ్యించుకున్నాడు? ఆమె పొగరుబోతయితే తనకెందుకూ ఆమెజోలి? ఆమెను ఎల్లాగయినా లొంగదీయాలనుకున్నాడు. లొంగదీయ లేకపోయాడు. అందుకూ అసలు అతనికి చిరాకువస్తొ. ఆమెతో సమంగా ఇంకే ఆడపిల్లా పుల్లలు పట్టలేదు. ఆమెతో ఎవరు పోటీ చెయ్యగలరు? ఆమె అసలయినపిల్ల. కొంచెం పెంకిది. అయితే యేం? తను మాత్రం పెంకివాడు కాడూ?

ఆమె జారి నీట్లో పడిపోడం. తను తీయడం! ఇంతటి ఘనకార్యం అతడు ఇంతవరకూ చెయ్యలేదు. ఈసారి ఆమె ఎల్లాగో తనకి లొంగిపోయింది. ఇంత కష్టపడి రక్షించిన ఆమె దేహం, నైతికంగా తనదయిపోయిందనుకున్నాడు వెంకడు. ఆమెను జయించాననుకున్నాడు.

వెంకడికి, ఈ లోకంలో ఏ ఆడపిల్ల ఒంటికీ ఈ పొంకం, ఈ నునుపూ, ఈ మెత్తదనం ఉండదనిపించింది.

ఆమెకు కొంచెం స్పృహ వచ్చినప్పుడు తన చేతిని రెండు చేతులతోనూ నొక్కింది. ఆ స్పర్శలో ఎన్నో సంగతులున్నాయి. తనని నీటిలోంచి తీసినందుకు కృతజ్ఞత, పంతంలో ఓడిపోయినట్టు ఒప్పందం...

నెమ్మదిగా ఆమె శరీరాన్ని దించి, వెంకడు రామి తల్లిదండ్రుల్ని పిలిచాడు.

చాలామంది చుట్టూ చేరారు. రామితల్లి నెత్తీనోరూ బాదుకుంటూ ఏడుస్తోంది. తండ్రి నోట మాటలేక చతికిలబడిపోయాడు.

చాకలిపెద్దలంతా చుట్టూ చేరి అంతా తలొకవైద్యం చేస్తున్నారు. కడుపు తొక్కి నీళ్ళు తీశారు. మంటచేసి ఒంటిని కాచారు.

రామితల్లి గొంతెత్తి ఏడుస్తోంది. "దొంగనాకొడుకు నా తల్లిని సంపేశాడమ్మో!"

వెంకడికి ఆ ఏడుపు వినబడలేదు. అలిసిపోయిన చూపులతో రామిని చూస్తున్నాడు.

రామి కొంచెం కదిలింది. కళ్లు సగం విడ్డాయి. వెంకడు దగ్గరగా వెళ్ళాడు.

రామి వెంకణ్ణి చూసింది. కాని బాధచేత వికృతమయిపోయిన ఆ చూపుల్లో ఆప్యాయం వెంకడు ఒక్కడే గ్రహించాడు. వెంకడి గుండె జల్లుమంది.

రామి తల్లికి ఆ చూపు ఆమె అనుమానాన్ని స్థిరపరిచింది. ఆమె గట్టిగా గొంతెత్తి ఏడిచింది.

"అమ్మో! దొంగనాకొడుకోయి! నా తల్లిని ముంచేశాడోయి! ఎవరూ లేకుండా సూసి ముంచేశాడమ్మోయి!"

వెంకడు నిర్ఘాంతపోయాడు. తనింత శ్రమపడ్డదానికి ప్రతిఫలం ఇదా?

రామికి ఎగఊపిరి పట్టింది. రామి తండ్రికి వెంకడితో వెనకటి దెబ్బలాటలన్నీ జ్ఞాపకం వచ్చాయి.

"నీ సంగతి కనుక్కుంటానుండు. పోలీసోళ్లని తీసుకొత్తా" అని గబగబా లేచి వెళ్ళిపోయాడు.

వెంకడింకా కొంచెం అలిసిపోయి ఉంటే రామితో తనూ గోదావరిలో కలిసిపోయి ఉండును. అంత కష్టపడి ఆమెను పైకితీశాడు. దాని ప్రాణమూ చివరికి దక్కేటట్టు కనబడదు. తనకి మిగిలింది ఈ నేరం.

వెంకడీ లోకం అంతా చెడ్డదనుకున్నాడు. తనూ రామీ ఈ లోకంలో తప్పుబుట్టారు.

**(భారతి - మే, 1938)**